# ముగింపు కథ

రచన:
శ్రీ రేగులపాటి కిషన్‌రావు

(గత సంచిక తరువాయి)

వరంధాములు లేచి నిలబడి చెప్పారు. "శారదకు యాదగిరికి పెద్దల సమక్షంలో పెళ్ళి కాకపోయినా సమయమూ, సందర్భమూ ఏదైనప్పటికీ వాళ్ళు మనస్ఫూర్తిగానే శారీరకంగా ఒకటయ్యారు. కనుక యాదగిరే శారద భర్త, అతను చనిపోయినందుకు శారద బాధపడుతున్న విషయం మనకు స్పష్టంగా అర్థమయింది. శారదకు తన గర్భములో పెరుగుతున్న ప్రాణికి తల్లి కావాలనే అభిలాష వుంది. శారద మంచి అమ్మాయి గనుక ఆమె అభిప్రాయాన్ని మన్నించాలి! "

"శారద పండంటి బిడ్డను కనాలని నేను మనస్ఫూర్తిగా కోరుకొంటున్నాను" తెల్లమీసాల పెద్ద మనిషి.

"నేను కూడా.... నేను కూడా ..." అంటూ అందరూ చెప్పేశారు,

శారద ఆ గదిలోకి వచ్చి పెద్ద లందరికీ పాదాభివందనం చేసింది. వాళ్ళు దీవించి వెళ్ళిపోయారు.

* * *

విశ్వనాధం ఇంటి ముందుకు రిక్షా వచ్చి ఆగింది.

"మామయ్య ఇల్లు ఇదేనా రంగా! నిన్ను చూసి చాలా రోజులైంది కదూ. మరిచిపోయి వుంటావు."

"నే నెందుకు మరిచిపోతానే.... నాకు బాగా జ్ఞాపకం వుంది...." రంగనాధం తల్లి దగ్గరకు వచ్చి మెల్లిగా చెప్పాడు. మామయ్య తెచ్చిన మామిడి పండ్లు నువ్వు దాచి ఇస్తే శారదకు కన్పించకుండా వంటింటి గదిలో కూర్చుండి తిన్నాను. మామయ్య చొక్కా జేబులో చేయిపెట్టి అందిన చిల్లరతో అయిసుక్రీం కొనుక్కొని అదిగో అక్కడ ఉన్న ఆ వేపచెట్టు క్రింద కూర్చుండి ఎన్నిసార్లు తినలేదూ .... ఇంకా!...."

"ఒరేయ్! నీవు యెదిరించి మాట్లాడకు! నేను చెప్పినట్టు చెయ్యి. అంబోతులాగా ఒళ్ళు పెంచుకోగానే సరిపోదు. ఇంటివద్ద నేనేమి చెప్పానో జ్ఞాపకముంచుకో!.... అంది తల్లి జగదాంబ.

"అమ్మగారూ! దబ్బిస్తే నేను వెళ్ళిపోతాను .... " అన్నాడు రిక్షా యజమాని.

"ఆఁ! ఇదిగో ఆ ప్రయత్నంలోనే ఉన్నాను నాయనా! ....చిల్లర లేనట్టుంది.... ఒరేయ్ విశ్వనాధం!" అంటూ ఇంట్లోకి తొంగి చూస్తూ కేకేసింది.

విశ్వనాధం గబగబా బయటకు వచ్చి, "ఆ దేమి టి అక్కా! ఉత్తరం ముక్కయినా రాయకుండా వచ్చేశావు!"

"నా పుట్టింటికి రావడానికి నా తమ్ముని ఇంటికి రావడానికి నేను ఉత్తరాలు రాయాలట్రా!"

"అది కాదే అక్కా! ఉత్తరం రాస్తే స్టేషన్‌కు వచ్చేవాణ్ని కదా!"

"అది సరే లేరా!....ఇతగానికి నాలుగు రూపాయలు పడెయ్యి, వెళ్ళిపోతాడు" అని చెప్పి, "రారా రంగా!" అంది.

రంగనాధం తల్లివెంట ఇంట్లోకి వెళ్ళాడు.

శారద మంచం వాల్చి అత్తనూ-బావనూ కూర్చుండమంది.

జగదాంబ ఆ గదిని పరిశీలించి చూచింది. కనిపించిన ప్రతి వస్తువునూ కసి-కసిగా చూసింది. విశ్వనాధం రిక్షా అతనికి డబ్బిచ్చి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. శారద కాఫీ చేయడానికి వంటింట్లోకి వెళ్ళింది.

"బావ యెలా ఉన్నాడే అక్కా!"

"ఆయనకేం మహారాజులాగ దేశాల వెంబడి తిరుగుతున్నాడు."

"ఆ తిరగడం ఇంకా మానుకో లేదా!"

"ఎందుకు మానుకుంటాడురా! చచ్చేలోగా దేశమంతా తిరిగి చూస్తాడట!"

విశ్వనాధం నవ్వి, రంగనాదంవైపు చూస్తూ అన్నాడు. "వీనికి ఏదైనా ఉద్యోగం దొరికిందా!"

"కలకత్తాలో జనపనార కంపెనీలో ఉద్యోగం ఉందట! పెద్ద ఉద్యోగమేనట! లంచం ఇస్తే వీనికే దొరుకుతుందట! ఆ ఉద్యోగానికి 'పదివేలు పట్టుకొని రారా!' అని వీని తండ్రి వీనికి ఉత్తరం రాశాడు. వీడు వెళ్తా నంటున్నాడు. వెళ్ళే ముందు మామయ్య అభిప్రాయం తెలుసుకొని వెళ్ళరా!" అన్నాను.

"అయితే ఇద్దరం వెళ్దాం రావే!" అన్నాడు అందుకే ఇద్దరం వచ్చేశాం!"

విశ్వనాథం నవ్వి ఊరుకున్నాడు.

శారద అందరికీ కాఫీ ఇచ్చింది.

రంగనాథం శారదను చూస్తూ కాఫీ త్రాగడమే మరచి పోయాడు. అది గమనించిన జగదాంబ అంది. "నీ మరదలు చేసిన కాఫీ ఎలా ఉందిరా?"

రంగనాథం చూపు మరల్చుకొని "బాగుంది-బాగుంది" అంటూ త్రాగేశాడు.

శారద వంటశాలలోకి వెళ్ళింది.

విశ్వనాథం సంచి పట్టుకొని వీధిలోకి వెళ్ళి పోయాడు.

జగదాంబ కొడుకును వెంటబెట్టుకొని ఇల్లంతా కలియ తిరిగి చూచింది.

"ఇల్లు యెంత బాగుందో చూశావు కదరా! ఈ యింటిలో యెన్ని వస్తువులున్నాయో లెక్కించడానికి వీలవుతుందా? ప్రతీ వస్తువు ఎంత అందంగా ఉందో గమనించావు కదా! ఈ ఇల్లు, ఈ వస్తువులు, ఈ ఆస్తి మొత్తం నీ స్వంతం కావాలంటే, నేను చెప్పినట్టు చెయ్యాలిరా!"

"చేస్తానమ్మా-చేస్తాను, నువ్వు చెప్పదలచిన విషయమేమిటో నా చెవిలో చెప్పేసెయ్యి. ఆ తర్వాత నా బుద్ధి బలాన్ని ఉపయోగించి కార్యరంగంలో దూకేస్తాను."

జగదాంబ కొడుకు చెవిలో, తాను చెప్పదలచిన విషయం చెప్పేసింది. రంగనాథం మనస్సు ఉత్సాహంతో నిండిపోయింది!

ఆ రోజు రాత్రి జగదాంబకు నిద్ర పట్టిందో - లేదో.... విశ్వనాథం ఆస్తిగురించి ఆలోచించింది!

రంగనాథం శారదను గురించి ఆలోచిస్తూ నిద్ర పోయాడు. ఆమెతో శారీరక సౌఖ్యం అనుభవించినట్టు కల గన్నాడు.

* * *

ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేసి ఏదో పనిమీద కరీంనగర్ వెళ్ళిపోయాడు విశ్వనాథం.

సాయంత్రంవేళ జగదాంబ కొడుకును దగ్గరకు పిలుచుకొని చెప్పింది. "నేను గుడికి వెళ్తున్నాను. శారద ఆ గదిలో కూర్చుండి ఏదో చదువుకొంటున్నది. నువ్వు వెళ్లి విషయం అడుగు. అడగడమే కాదు. దానిని పెళ్లికి ఒప్పించు, ఒప్పుకోకపోతే......."

"ఒప్పుకోకపోతే ఏం చెయ్యాలో నాకు తెలుసులేవమ్మా. నువ్వు తొందరగా వెళ్లిపో ఇక్కడినుండి" అన్నాడు రంగనాథం ఉత్సాహంతో.

జగదాంబ గున్నఏనుగులా కదిలిపోయింది.

రంగనాథం శారద గదిలోకి వచ్చాడు.

"ఏం కావాలి బావా?" శారద మృదువుగా అడిగింది.

"నీ చెయ్యి చూడడానికి వచ్చాను మరదలా."

"నా చెయ్యి చూడడ మెందుకు?"

"నీ చెయ్యి చూచి నీ భావి జీవితం ఎలా వుంటుందో చెప్పేస్తాను."

"ఈ విద్య ఎప్పుడు నేర్చావు బావా?"

"ఈ ఊరికి వచ్చేముందు నేర్చుకొని వచ్చాను మరదలా?"

"అయితే చూడు" అంటూ శారద చేయి చాచింది.

రంగనాథం శారద చేయి పట్టుకొని అన్నాడు: "నీకూ నాకూ ఇప్పుడే పాణిగ్రహణం అయిపోయింది. మరి కొన్ని నిమిషాల్లో మనకు శోభనం జరిగిపోతుంది...."

శారద చేయి లాక్కొని అంది "యాదగిరికీ నాకూ పాణిగ్రహణం అయిపోయింది. అంతేకాదు మరో ఆరు నెలల్లో యాదగిరి తండ్రి కాబోతున్నాడు."

రంగనాథం శారదను పట్టుకోబోయాడు. ఆమె దూరం జరిగి అంది "నన్ను అనవసరంగా అల్లరిపాలు చెయ్యకు బావా."

"అల్లరిపాలు చేయడానికి రాలేదు మరదలా! అనుభవించడానికి వచ్చాను" అతడు హఠాత్తుగా శారద చేయి పట్టుకున్నాడు.

"చెయ్యి వదులు"

"వదలను"

శారద బలవంతంగా చెయ్యి లాక్కొని మేడపైకి పరుగెత్తింది. రంగనాథం ఆలస్యం చేయకుండా మేడపైకి వచ్చేశాడు శారదను పట్టేశాడు.

"బావా! నీకు దండం పెడుతాను నన్ను వదిలి వెళ్ళిపో."

"దండం పెట్టడ మెందుకు? నన్ను ఆలింగనం చేసుకో నన్ను నీలో ఐక్యం చేసుకో మరదలా" అంటూ శారదను ఆలింగనం చేసుకోబోయాడు.

శారద రంగనాథం చెయ్యిని బలంగా కొరికింది.

రంగనాథం గావుకేక వేసి శారదను బలంగా వెనుకకు నెట్టేశాడు. ఆమె శరీరం మేడమీది నుండి క్రిందికి పడిపోయింది.

శారద యాదగిరి చెంతకు వెళ్లిపోయింది.

(సంపూర్ణం)